కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -145 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 06-06-2026 | శనివారం | పేజీలు : 4

# బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల దోపిడీ



- ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదు: కేసీఆర్‌పై సీఎం తీవ్ర విమర్శలు
- పాలమూరు ప్రాజెక్టులపై గత ప్రభుత్వంపై రేవంత్ ధ్వజం
- ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణ
- పాలమూరు అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన పనులు: సీఎం
- కాళేశ్వరం కూలాక నీటి నిర్వహణలో మార్పులు: రేవంత్
- భూసేకరణ లేకపోవడమే ప్రాజెక్టుల ఆలస్యానికి కారణం: సీఎం
- బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు విలువ లేదని సీఎం వ్యాఖ్య

**మహబూబ్ నగర్ ,జూన్ 5 (బిఎన్ఎస్ ):**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. రెండో రోజు పర్యటనలో భాగంగా పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ప్రాజెక్టు పనులను ఆయన ప్రత్యక్షంగా చూశారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రాజెక్టుల పేరుతో పెద్ద మొత్తంలో నిధులు ఖర్చయినా, భూసేకరణ, పూర్తిస్థాయి పనులు జరగలేదని ఆయన ఆరోపించారు. కోట్లాది రూపాయల ఖర్చు జరిగినా రైతులకు నీరు చేరలేదని ఆయన వ్యాఖ్యానించారు.

పాలమూరు జిల్లాలో జూరాల మినహా ఇతర ప్రధాన ప్రాజెక్టులు పూర్తికాలేదని సీఎం పేర్కొన్నారు. గత పాలనలో ప్రాజెక్టుల పురోగతిపై అవాస్తవాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆయన విమర్శించారు. ఎత్తిపోతల పథకాల పనుల్లో అవినీతి జరిగిందని, దీనిపై అప్పట్లోనే మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి నిరంతరం ప్రశ్నించారని ఆయన గుర్తు చేశారు.

కే . చంద్రశేఖర్ రావు నేతృత్వంలోని గత ప్రభుత్వం పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా నిధులను వృథా చేసిందని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టు కోసం భారీ అంచనాలు వేసినా, సగం పనులు మాత్రమే పూర్తయ్యాయని, అందువల్ల ఆశించిన స్థాయిలో ఆయకట్టు అభివృద్ధి జరగలేదని చెప్పారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేల కోట్ల రూపాయలు కేటాయించి పెండింగ్ పనులను వేగవంతం చేస్తున్నామని సీఎం తెలిపారు. భూసేకరణ సమస్యలు, పునరావాస చర్యలు పూర్తిచేసిన తర్వాతే రిజర్వాయర్లను నింపడం సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, అవసరమైతే భూసేకరణకు అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని ఆయన అన్నారు. కర్ణాటకతో సమన్వయం చేసుకుని నీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

బీఆర్ఎస్ నేతల విమర్శలను ఆయన తోసిపుచ్చారు. రాజకీయ వ్యాఖ్యలకు విలువ లేదని, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని ఆయన సూచించారు. గత పాలనలో ప్రారంభమైన అనేక ప్రాజెక్టులు నిలిచిపోయాయని, వాటిని పూర్తిచేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.

మొత్తానికి పాలమూరు ప్రాంత ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే తమ ప్రాధాన్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## తెలంగాణ జల హక్కులను కాపాడటంలో సర్కార్ విఫలం

- జల హక్కులపై ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు
- కృష్ణా జలాల వాటా తగ్గిందని ఆరోపణ
- సాగునీటి ప్రాజెక్టులపై హరీశ్ రావు లేఖ
- కాంగ్రెస్ నిర్లక్ష్యంపై తీవ్ర వ్యాఖ్యలు
- జల వనరుల పరిరక్షణకు డిమాండ్


2 లో

హైదరాబాద్, జూన్ 5: తెలంగాణ జల హక్కుల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర జల వనరులు ప్రమాదంలో పడ్డాయని లేఖలో పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.

## 'లిక్కర్ స్కామ్ లేదు.. అంతా కక్షే'

### కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు.. మద్యం విధానాలు, నకిలీ మద్యం అంశాలపై విమర్శలు


2 లో

అమరావతి, జూన్ 5: కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ఉనికిలోనే లేని 'లిక్కర్ స్కామ్' పేరుతో ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని రాజకీయ కక్ష సాధింపులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష నేతలను వేధించడమే ప్రధాన లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. మొదట రూ.30 వేల కోట్ల స్కామ్ అని, తర్వాత రూ.3 వేల కోట్లకు తగ్గించడం ద్వారా ఆరోపణల్లోనే స్పష్టత లేకుండా ఉందని వ్యాఖ్యానించారు.

## రాష్ట్ర పురోగతికి 'డబుల్ ఇంజిన్' పాలన అవసరం


2 లో

- తెలంగాణ పురోగతికి కేంద్ర-రాష్ట్ర సమన్వయం కీలకం
- ప్రజల విశ్వాసం బీజేపీ వైపే
- అభివృద్ధి, సంక్షేమంలో సమన్వయమే లక్ష్యం: రాంచందర్‌రావు

హైదరాబాద్, జూన్ 5: రాష్ట్ర అభివృద్ధి వేగవంతం కావాలంటే కేంద్రం, రాష్ట్రంలో ఒకే విధానంతో పనిచేసే ప్రభుత్వాలు అవసరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల్లో బీజేపీ పట్ల విశ్వాసం పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిధుల వినియోగం, ఉద్యోగ నియామకాలు, సాగునీటి రంగాల్లో అనేక లోపాలు చోటు చేసుకున్నాయని విమర్శించారు.

## ప్రకృతి పరిరక్షణలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలి


2 లో

సిద్దిపేట, జూన్ 5: పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని మర్పడగ గ్రామ అర్బన్ ఆక్సిజన్ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మొక్కలు నాటి, పర్యావరణ అవగాహనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం హాజరైన వారితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

## రూ.1600 కోట్ల బొగ్గు కుంభకోణం

### : కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ

- 40 లక్షల టన్నుల బొగ్గు గల్లంతు
- సింగరేణి బొగ్గు స్కాంపై సిట్టింగ్ జడ్జి విచారణకు డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వంలో సింగరేణి కుంభకోణాలు పెరిగాయని కేటీఆర్ ఆరోపణలు


2 లో

**జూన్ 5 ,బిఎన్ఎస్ :**

సింగరేణిలో జరిగిన రూ.1600 కోట్ల కుంభకోణంపై విచారణ జరపాలని కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు. సింగరేణి నిల్వల నుంచి సీఎం రేవంత్ రెడ్డి రూ.1600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని, స్టాక్ యార్డుల్లో ఉండాల్సిన బొగ్గును అప్పనంగా అమ్ముకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక సింగరేణి వరుస కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని విమర్శించారు.

## కొత్త రాజకీయ ఉద్యమానికి అన్నామలై శ్రీకారం


2 లో

చెన్నై, జూన్ 5: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే. అన్నామలై పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అదే సమయంలో రాష్ట్రంలో కొత్త రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

తన నిర్ణయానికి కారణంగా పార్టీ కేంద్ర నాయకత్వంతో ఏర్పడిన వ్యూహాత్మక అభిప్రాయ భేదాలను ఆయన ప్రస్తావించారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ ముందుకు సాగాల్సిన దిశపై తన అభిప్రాయాలు, పార్టీ నాయకత్వ ఆలోచనల మధ్య భిన్నతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై కొంతకాలంగా చర్చలు జరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో ఏకాభిప్రాయం కుదరలేదని తెలిపారు.

## ఏపీ అభివృద్ధి చెందితే భారత్ అభివృద్ధి చెందుతుంది

- బ్లూ ఎకానమీపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- సీ-ఫుడ్ రంగంలో ఏపీకి రెండో స్థానం
- విశాఖ వర్క్‌షాప్‌లో అభివృద్ధి దిశపై చర్చ
- సముద్ర ఆర్థిక వ్యవస్థే భవిష్యత్: సీఎం
- ఏపీ ఎగుమతులపై కీలక గణాంకాలు వెల్లడి


2 లో

**విశాఖపట్నం, జూన్ 5(బిఎన్ఎస్) :**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధిస్తే దేశ అభివృద్ధికి కూడా అదే స్థాయిలో ఊతం లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బ్లూ ఎకానమీని సమర్థంగా వినియోగించుకుంటే భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

విశాఖలో నిర్వహించిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌ను ముఖ్యమంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో సముద్ర ఆహార ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

భారతదేశ సీ-ఫుడ్ ఉత్పత్తిలో రాష్ట్రం రెండో స్థానంలో ఉందని, ఏటా సుమారు 197 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోందని వివరించారు.

## పాలన చేతకాకపోతే రాజీనామా చేయాలి

- ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం రాష్ట్ర ప్రభుత్వానిదే
- రైతుల సమస్యలపై రాజకీయాలు తగవు
- కేంద్రంపై నెపం మోపడం సరికాదు

: ధర్మపురి అరవింద్


2 లో

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీహెచ్‌సీ రాపూర్‌ను సందర్శించిన

# డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎ. పరిమళ



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్) :–ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎ. పరిమళ శుక్రవారం సీహెచ్‌సీ రాపూరు ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ అర్షియా సమర్థవంతమైన పరిపాలనలో వైద్యులు మరియు సిబ్బంది అందిస్తున్న సేవలు, అంకితభావం, కృషిని డాక్టర్ పరిమళ ప్రశంసించారు.

ఈ సందర్భంగా విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ హరీష్, డాక్టర్ దిదీప్య, డాక్టర్ మమత, స్టాఫ్ నర్సులు అరుణ మరియు చెన్నమ్మలకు మొమెంటోలు అందజేసి వారి సేవలను అభినందించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వీరు చూపుతున్న కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

అనంతరం ఆసుపత్రిలోని అన్ని విభాగాలను సందర్శించిన డీసీహెచ్ఎస్ గారు, ఆసుపత్రిని జిల్లాలోనే ఉత్తమ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను అందించారు. ఉన్న లోటుపాట్లను గుర్తించి వాటిని త్వరితగతిన పరిష్కరించి మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది మరియు ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## రాపూరులో వైసీపీ ఆధ్వర్యంలో

# వెన్నుపోటు దినం నిరసన



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):– కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు నిరసనగా వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, పాపకన్ను మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు రాపూరులో శుక్రవారం వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు బొడ్డు మధుసూదన్ రెడ్డి, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దందొలు లక్ష్మీనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో కూటమి పార్టీల ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను దహనం చేశారు, ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమై ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోనే వంద శాతం సంక్షేమం సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏటూరు మురళీమోహన్ రెడ్డి, ఒంకివోలు కోటేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఖాదర్ బాషా, పుట్టంరెడ్డి కృష్ణారెడ్డి, రేవూరు వరబాబు, డి.వి. రమణయ్య, శ్రీపురం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లలు మృతి




కామారెడ్డి జిల్లా బోల్లక్ పల్లి మంజీర బ్రిడ్జ్ వద్ద ఉన్న ఎల్లమ్మ గుడి దగ్గర మొక్కులు తీర్చుకునేందుకు వచ్చి మంజీరా నది లోకి వెల్లి కాళ్లు చేతులు శు భ్రం చేసుకునే సమయంలో ప్రమాదవశాత్తు నీటిలోపడి మునిగి లింగంపేట్ మండలం పరిమల గ్రామానికి చెందిన అనిత 38 శివాని 13 మృతి చెందగా భాను ప్రసాద్ 13 ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు పిట్లం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన బాలిక పావని 15 సైతం నీటిలో మునిగి మృతి చెందగా వీరి మృతదేహాలను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు

# ప్రజా సేవ ముఖ్యం



అనకాపల్లి, జూన్ 5: నియోజకవర్గ పరిధిలోని భూ సమస్యలు, రెవెన్యూ వివాదాల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం చోడవం నియోజకవర్గం, చోడవరం మండలం, కొత్తూరు జంక్షన్ లో మాధవ ఫంక్షన్ హాల్ లో ఒక నెల– ఒక నియోజక వర్గం– నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, చోడవరం శాసనసభ్యులు కె. ఎస్. కె. ఎన్ రాజు తో కలసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను శీఘ్రగతిన పరిష్కారం మరియు రెవెన్యూ శాఖలో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన కార్యక్రమం "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు" కార్యక్రమాన్ని జిల్లాలో ఇక్కడ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

# అసలైన యజమానులం.. న్యాయం చేయండి...







హైదరాబాద్, జూన్ 5:(బిఎన్ఎస్): 40 ఏళ్లుగా పోరాటం చేస్తున్న తమకు న్యాయం చేయాలని లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు అభ్యర్థించారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో వారి ఆవేదన వ్యక్తం చేశారు.

రామచంద్రాపురం మండలం కొల్లూరు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్స్ 168, 169, 172, 174, 175, 177, 180, 181, 187, 188, 189, 190 వరకు ఉన్న భూమికి తామే అసలైన యజమానులం అని తెలియచేశారు. 1984 లో ప్రభుత్వ అనుమతితో భూములను కన్వర్షన్ చేయటం జరిగింది. మొత్తం భూమిని 1520 ప్లాట్స్ గా విభజించి, మార్కింగ్ చేసి, రోడ్లు వేయటం జరిగింది. అటువంటి ప్లాట్స్ ను న్యాయబద్దంగా డబ్బులు చెల్లించి తాము భూములను కొనుక్కొని, రిజిస్ట్రేషన్ చేయించుకొన్నట్లు అసోసియేషన్ సభ్యులు వివరించారు. పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించుకొన్నందున, చట్టబద్దమైన డాక్యుమెంట్స్ ఉన్నాయని వివరించారు.

2002 సమయంలో అవుటర్ రింగ్ రోడ్ ఏర్పడుతుందని వార్తలు రావటంతో కొంతమంది కబ్జాదారులు అక్కడ వాలిపోయారు. రైతులను మభ్యపెట్టి దొంగ డాక్యుమెంట్స్ తయారుచేయించి, భూములను ఎకరాల్లోకి మార్చేసుకొని, అక్కడ తిష్ట వేసుకొని కూర్చొన్నారు. గడువు తీరిపోయిన పేపర్స్ ఉపయోగించటం, ఒకే భూమిని అనేక మందికి విక్రయించటం, రోడ్లను తొలగించటం, రాళ్లు తీసేయటం వంటివి చేయించారు. దీని మీద ఎంత మొత్తుకొంటున్నా పట్టించుకోవటం లేదు. న్యాయబద్దంగా కొనుక్కొన్న ప్లాట్ ఓనర్స్ ను అక్కడ భూముల్లోకి రానీయటం లేదు. దీని మీద లోకాయుక్త ను ఆశ్రయించగా, ప్రభుత్వ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. స్థానిక ఎమ్మార్వో, పోలీస్ ఇన్ స్పెక్టర్, రిజిస్ట్రార్ లతో కూడిన కమిటీ రికార్డులు తనిఖీ చేసి నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా ప్లాట్ ఓనర్స్ మాత్రమే అసలైన యజమానులు అని, ఒకసారి కన్వర్షన్ జరిగి ప్లాట్స్ గా మార్చాక, మళ్లీ ఎకరాల్లోకి మార్చటం కుదరదు అని లోకాయుక్త తీర్పు ఇచ్చిందని అసోసియేషన్ సభ్యులు వివరించారు.

ప్రజలు తమ కష్టార్జిత ధనంతో కొనుగోలు చేసిన ప్లాట్లపై నేడు అనిశ్చితి నెలకొనడం అత్యంత ఆందోళనకర విషయం. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపాలు, రికార్డుల నిర్వహణలో జరిగిన పొరపాట్లు, ఇతర కారణాలతో సాధారణ పౌరులు నష్టపోవడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ప్రజలకు నిజాలు తెలియాలి. రికార్డులు బయటకు రావాలి. బాధ్యులు ఎవరో తేలాలి. బాధితులకు న్యాయం జరగాలి.

- 1984 నుండి ఇప్పటి వరకు జరిగిన అన్ని భూ రికార్డు మార్పులను పరిశీలించాలి.
- రిజిస్ట్రేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ శాఖల పాత్రపై సమగ్ర విచారణ జరపాలి.
- వేల మంది ప్లాట్ యజమానుల హక్కులను ప్రభుత్వం చట్టబద్ధంగా రక్షించాలి.
- భూముల ప్రస్తుత చట్టబద్ధ హోదాపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలి.
- అసలైన ప్లాట్ యజమానులకు భూములు అప్పగించాలి.

ఇది కేవలం భూముల వివాదం కాదు. ఇది వేలాది కుటుంబాల భవిష్యత్తుకు సంబంధించిన విషయం. ఇది ప్రజల ఆస్తి హక్కులకు సంబంధించిన విషయం. ఇది ప్రభుత్వ వ్యవస్థల జవాబుదారీతనానికి సంబంధించిన విషయం. ప్రభుత్వం వెంటనే స్పందించి పూర్తి వాస్తవాలను ప్రజల ముందుంచి, కొల్లూరు భూ బాధితులకు న్యాయం చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము. భూమి కొనుగోలు చేసిన ప్రజలు తప్పు చేయలేదు... వ్యవస్థలో తప్పు జరిగి ఉంటే దానికి ప్రజలు బలి కావద్దు. అని విన్నవించారు. న్యాయం కోసం గవర్నర్, ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులకు, కమిషన్స్ కు వినతి పత్రాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

అయినప్పటికీ, తమ ప్లాట్స్ లోకి తమను రానీయటం లేదని సభ్యులు వాపోతున్నారు. తమలో చాలా మంది స్థానిక ప్రభుత్వ రంగ సంస్థల్లో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకొంటూ, డబ్బు కూడబెట్టుకొని ప్లాట్స్ కొనుక్కొన్నామని చెబుతున్నారు. ఇప్పుడు తామంతా రోడ్డున పడ్డామని వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని, తప్పుడు డాక్యుమెంట్స్ ను క్యాన్సిల్ చేయాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు విన్నవిస్తున్నారు.

## ఏఐ సాంకేతికతతో

# చిన్నారుల వికాస గుర్తింపు




నెల్లూరు జిల్లా సైదాపురం (బిఎన్ఎస్): –నెల్లూరు జిల్లా సైదాపురం మండల కేంద్రంలోని డాక్టర్ సి.ఆర్.ఆర్. కళాశాలలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు (ఏఐ) ఆధారిత ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగుతుందని, శనివారం మరో సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ అందించనున్నట్లు సూపర్వైజర్ కె ధనమ్మ, తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ప్రవీణ్, సూపర్వైజర్ ఎస్ కే ఫాతిమా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# నెహ్రూ జూ పార్క్‌లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్



బిఎన్ఎస్, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' ఉత్సవాలలో భాగంగా హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శనశాల (జూ పార్క్)లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బహదూర్‌పురా నియోజకవర్గం శాసనసభ్యులు మహ్మద్ ముబీన్, జూ పార్క్ క్యూరేటర్ జె. వసంత, ఐఎఫ్ఎస్‌తో కలిసి పశుగ్రాస ప్రాంతంలో మొక్కలు నాటి ఈ డ్రైవ్‌ను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం రామనాథపుర కార్పొరేటర్ మహ్మద్ ఖాదర్‌తో కలిసి ఎమ్మెల్యే జూ పార్క్‌లోని ప్రైమేట్ పార్క్, ఏనుగుల ఆవరణ, సఫారీ పార్క్ కాంప్లెక్స్, ఖడ్గమృగాల ఆవరణ, సరీసృపాల గృహం మరియు నిశాచర జంతువుల గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో నెహ్రూ జూ పార్క్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని కొనియాడారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతని, 'ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం పౌరుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అద్భుతమైన చర్యలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. జూ పార్క్ క్యూరేటర్ శ్రీమతి జె. వసంత మాట్లాడుతూ.. ప్రజల్లో చైతన్యం తేవడానికే ప్రతి ఏటా జూన్ 5న పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటామని, ఇందులో భాగంగా ఈరోజు జూ పార్కులో 200కు పైగా మొక్కలు నాటామని, రాబోయే రోజుల్లో ఈ పెంపకాన్ని మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. ఈ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో జూ పార్క్ డిప్యూటీ క్యూరేటర్ శ్రీ జె. మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ. హకీమ్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ క్యూరేటర్లు నజియా తబస్సుమ్, బి. లక్ష్మణ్, పీఆర్వో హెచ్.ఎం. హనీఫుల్లా మరియు ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటారు.

# పర్యావరణ పరిరక్షణకై టీడీపీ నేత వినూత్న ప్రచారం

### – సైకిల్‌పై వెళ్లి మొక్కలు నాటిన మాజీ ఉప సర్పంచ్ పిచ్చుక రాజు



బిఎన్ఎస్, కుక్కునూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (మే 5) పురస్కరించుకొని కుక్కునూరు మేజర్ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ పిచ్చుక రాజు సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చారు. కాలుష్య రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా ఆయన శుక్రవారం వినూత్న రీతిలో పర్యావరణ పరిరక్షణ ప్రచారాన్ని చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనే అవగాహన కల్పించేందుకు ఈ టీడీపీ నేత స్వయంగా సైకిల్‌పై ప్రయాణించి, పలు ప్రాంతాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పిచ్చుక రాజు మాట్లాడుతూ... పెరుగుతున్న కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ విపత్తుల నుండి భూమిని కాపాడుకోవడానికి విస్తృతంగా మొక్కలు నాటడమే ఏకైక మార్గమని పిలుపునిచ్చారు. అలాగే, ఇంధన పొదుపు, శారీరక దారుఢ్యం కోసం ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో సైకిల్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఒక ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన ఈ వినూత్న ప్రయత్నాన్ని, సామాజిక స్పృహను స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు ఎంతగానో అభినందిస్తున్నారు.

# చార్మినార్ వద్ద ఈవ్ టీజింగ్.. ఐదుగురికి శిక్ష ఖరారు



హైదరాబాద్, బిఎన్ఎస్: చార్మినార్ వద్ద ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన ఐదుగురు నిందితులకు శిక్ష ఖరారైంది. మహిళలకు అనుచితంగా తాకి వేధించిన కేసులో ఇటీవల ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆధారాలతో సహా వారిని పట్టుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం ఒక్కో నిందితుడికి 3 రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించింది. వేధింపులు, స్టాకింగ్, సైబర్ హరాస్మెంట్‌పై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మహిళలు ఫిర్యాదుల కోసం 100, 112 94906 16555 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని షీ టీమ్స్ పిలుపునిచ్చాయి.

